మామ హత్యకు కోడలు సుపారీ

- 300 కోట్ల ఆస్తి కోసం కోడలి దారుణం
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం

పురుషోత్తం అర్చన

నాగపూర్, జూన్ 12: తగినంత జీతం..మంచి జీవితం.. సమాజంలో మంచి గౌరవం ఉన్నా మామకు ఉన్న రూ.300 కోట్ల ఆస్తి కోసం అత్యాశ పడింది ఓ కోడలు. అతడిని కారుతో ఢీ కొట్టి చంపించి ఆస్తి కాజేయాలనుకొంది. ఇందుకోసం రూ.1 కోటి సుపారీ ఇచ్చేందుకు సిద్ధమైంది. అయితే పోలీసుల నిశితంగా దర్యాప్తు చేయడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. నాగపూర్ పోలీసుల కథనం ప్రకారం... అర్చన మనీశ్ పుట్టివార్(53) ప్రభుత్వ టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తుంది. ఆమె భర్త మనీశ్ వైద్యుడు. ఇటీవల అర్చనకు మామ పురుషోత్తం పుట్టివార్(82) ఆస్తిపై కన్ను పడింది. అత్త శకుంతల అనారోగ్యంతో ఉండటంతో.. మామను అడ్డు తొలిగించుకుంటే రూ.300 కోట్ల విలువైన కుటుంబ ఆస్తి మొత్తం తన సొంతం అవుతుందని ఆలోచన చేసింది. మామ హత్యకు కుట్ర పన్నింది. తన భర్త వద్ద డ్రైవర్‌గా పని చేసే బగ్డే, అతడి స్నేహితులు నీరజ్ నిమ్జే, సచిన్ ధార్మిక్‌కు మామను అంతమొందించే పని అప్పగించింది.

అనుమానమే పట్టించింది

దాదాపు 15 రోజుల క్రితం దవాఖానలో చికిత్స పొందుతున్న తన భార్య శకుంతలను కలిసి పురుషోత్తం బయటకు వస్తుండగా బగ్డే, అతడి మిత్రులు కారుతో ఢీ కొట్టి పారిపోయారు. ఈ ఘటనలో పురుషోత్తం ప్రాణాలు కోల్పోయారు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటన కాదని పోలీసులు అనుమానించారు. లోతైన విచారణ జరపగా అర్చన పన్నిన కుట్ర బయటపడింది. దీంతో పోలీసులు ఆమెతో పాటు హత్యకు పాల్పడ్డ మరో ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితురాలు టౌన్‌ప్లానింగ్ శాఖలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. వాటిని తవ్వి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డవారిని పరామర్శిస్తున్న భారత రాయబారి ఆదర్శ్ స్వైకా

కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

41 మంది భారత వలస కార్మికుల దుర్మరణం
కిక్కిరిసిన భవనంలో ప్రాణాలు తీసిన పొగ

దుబాయ్: కువైట్‌లోని మంగఫ్ సిటీలో బుధవారం ఉదయం 6 గంటలకు భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ క్రిమినల్ ఎవిడెన్స్ మేజర్ జనరల్ ఈద్ అల్ ఓవీహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌బీటీసీకి చెందిన 6 అంతస్తుల భవనంలో చెలరేగిన మంటల్లో అక్కడికక్కడే 35 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 30 మంది గాయపడ్డారు. వారిలో దవాఖానలో చికిత్స పొందుతూ ఆరుగురు కన్నుమూశారు. వీరంతా భారతీయ వలస కార్మికులే. వంట గదిలో ప్రమాదం జరిగిందని, అనంతరం మంటలు వ్యాపించాయని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఇరుక్కుపోయి అక్కడ వెలువడిన పొగ పీల్చడం వల్ల పలువురు కార్మికులు చనిపోయినట్టు తెలుస్తున్నది. భవనంలో దాదాపు 160 మంది కార్మికులు పని చేస్తున్నారు. చికిత్స పొందుతున్నవారిని కువైట్‌లోని భారత రాయబారి ఆదర్శ్ పరామర్శించి సంపూర్ణ సహకారం అందజేస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలకు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాదం జరిగిన భవనంలో కార్మికులు కిక్కిరిసి ఉన్నారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

హిందుత్వ భావన తగ్గిందా?!

తాజా ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గడానికి ప్రధాన కారణం అదే! ● మోదీ మెజారిటీ వాదాన్ని పూర్తిగా అంగీకరించని హిందూ ఓటర్లు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రధానిగా బీజేపీ అగ్రనేత నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఎన్నికల ముందు ఉన్న వాడీ, వేడీ ప్రస్తుతం ఆయనలో మచ్చుకైనా కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా తనను తాను రాజు, దేవుడిగా అభివర్ణించుకున్న మోదీని ప్రజలు నీవు రాజువు కావు, దేవుడివి అంతకన్నా కావంటూ చాలా సీట్లలో ఓడించి పంపారు. బతుకుజీవుడా అని సామాన్య మెజారిటీతో మూడోసారి పీఠాన్ని అధిరోహించిన మోదీ ఇప్పుడు మునుపటి సామాన్య ప్రధానే. అయితే హిందుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా తనను తాను భావించుకునే మోదీ ఈ ఎన్నికల ప్రచారంలో దానిని బహిర్గతం చేసుకోవడానికి ఏమాత్రం మొహమాటం పడలేదు. దాని పర్యవసానంగానే ఒక వర్గం వారిని నేరుగానే తన ప్రచారంలో టార్గెట్ చేశారు. ఇది సహజంగానే ఆ వర్గాల్లో కోపం రగిలించింది. అయితే తాజాగా వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఆయన వాదాన్ని అటు హిందువులు కూడా పూర్తిగా అంగీకరించలేదన్న వాదన వినిపిస్తున్నది.

హిందువులు మోదీనే వద్దనుకుంటున్నారా?

మెజారిటీ వర్గమైన హిందువుల్లో సెంటిమెంట్ రగిలించడానికి ప్రయత్నం జరిగినా.. ప్రజలు పూర్తిగా అంగీకరించలేదంటే ప్రజలు హిందుత్వ భావననే తిరస్కరిస్తున్నారా? లేక హిందుత్వ ప్రతినిధిగా మోదీని వద్దనుకుంటున్నారా అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తలెత్తాయి. భారత దేశమంటేనే విభిన్న మతాలు, కులాలు, జాతులు, భాషలు, పార్టీలు, విధానాల సమ్మేళనం. దీని వల్ల సామాన్య ఓటరు ఎలా వ్యవహరిస్తాడు.. ఎలా స్పందిస్తాడనేది ఊహించడం నరమానవుడికెవరికీ సాధ్యం కాదు! ఈ ఎన్నికల్లో హిందీ మాట్లాడే రాష్ట్రాలతో పాటు ఈశాన్య భారతంలోని కొన్ని చోట్ల బీజేపీ బాగా నష్టపోయినట్టు లెక్కలు చెప్తున్నాయి.

ప్రభావం చూపే అంశాలెన్నో

2014, 2019 ఎన్నికల్లో బీజేపీపై విశ్వాసాన్ని ప్రకటించిన దళిత-బహుజన కులాలు ఈసారి ఆ పార్టీపై నమ్మకం కోల్పోయినట్టు తాజా లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా హిందుత్వ నినాదానికి గుండెకాయగా భావించే యూపీలో ఈ విషయం ప్రస్ఫుటంగా కనిపించింది. అయితే హిందుత్వ కారణమొకటే బీజేపీపై ఆదరణ తగ్గడానికి కారణం కాదని... పలు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఎన్నికల్లో ప్రభావం చూపాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే సావర్కర్ హిందుత్వ భారత్ విజన్ పట్ల వ్యతిరేకతో, నెహ్రూ లౌకిక జాతీయవాదానికి అనుకూలంగానో ప్రజలు స్పందించారనో, సాంస్కృతిక న్యాయంపై సామాజిక న్యాయం జయించాలన్న అంబేద్కర్ నినాదానికి మద్దతు తెలిపారనో భావించడం కష్టసాధ్యమవుతుందని వారు పేర్కొంటున్నారు.

తమిళిసైకి అమిత్ షా మందలింపు!

చంద్రబాబు ప్రమాణ స్వీకారంలో పిలిచి కోప్పడిన బీజేపీ అగ్ర నేత అన్నామలైతో విభేదాలే కారణం!

విజయవాడ, జూన్ 12: తెలంగాణ మాజీ గవర్నర్, తమిళనాడు బీజేపీ నాయకురాలు తమిళిసైపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టుగా కనిపిస్తున్న వీడియో వైరల్‌గా మారింది. బుధవారం విజయవాడలో జరిగిన ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి అమిత్ షా హాజరయ్యారు. అక్కడే ఉన్న తమిళిసై ఆయన వద్దకు వెళ్లి నమస్కరించి వెళ్లిపోతుండగా.. అమిత్ షా ఆమెను వెనక్కు పిలిచి మాట్లాడారు. ఈ సమయంలో అమిత్ షా ముఖంలో ఆగ్రహం స్పష్టంగా కనిపించింది. ఆయన వేలు చూపించి మరీ ఆమెను ఏదో విషయంలో మందలిస్తున్నట్టుగా వీడియోలో కనిపించింది. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైతో తమిళిసైకి విభేదాలు తీవ్రం కావడం వల్లే ఆమెను అమిత్ షా మందలించారనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో తమిళనాడులో బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించకపోవడంతో అన్నామలై, తమిళిసై వర్గాల మధ్య విభేదాలు మొదలయ్యాయి. అన్నామలై తీరుతోనే పార్టీ ఓడిపోయిందని, అన్నాడీఎంకేతో పొత్తు తెంచుకోవడానికి ఆయనే కారణమనే విమర్శలు మొదలయ్యాయి. ఎన్నికల్లో ఓటమిపై ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి.

ఇది మర్యాదగా ఉందా?

తమిళిసైతో అమిత్ షా మాట్లాడుతున్న వీడియోపై డీఎంకే అధికార ప్రతినిధి అన్నాదురై స్పందించారు. 'ఇవి ఏ రకమైన రాజకీయాలు ? తమిళనాడుకు చెందిన ప్రముఖ మహిళా నాయకురాలిని బాహాటంగా మందలించడం మర్యాదేనా ? ఇది అందరూ చూస్తున్నారని అమిత్ షా తెలుసుకోవాలి. ఇది చాలా తప్పు' అంటూ ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

రైతుల హత్యకు శివరాజే బాధ్యుడు!

- ఆ వ్యక్తికి వ్యవసాయ శాఖనా?
- తీవ్రంగా వ్యతిరేకించిన ఎస్కేఎం
- పోరాటాలకు పిలుపు

న్యూఢిల్లీ, జూన్ 12: కేంద్ర వ్యవసాయ మంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్ నియామకాన్ని రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆయన నియామకంపై నిరసన వ్యక్తం చేస్తూ రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మధ్యప్రదేశ్ సీఎంగా ఉన్న సమయంలో 2017 జూన్‌లో మందసౌర్‌లో జరిగిన ఆరుగురు రైతుల హత్యకు ఆయనే బాధ్యుడని పేర్కొన్నది. కనీస మద్దతు ధర, రైతు రుణాల మాఫీ కోరుతూ జరిగిన భారీ ఆందోళనలో పాల్గొన్న రైతులను హత్య చేశారని ఆరోపించింది. శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమిస్తూ బీజేపీ సర్కార్ తీసుకొన్న నిర్ణయం స్పష్టమైన మెజార్టీతో గత రెండు పర్యాయాలు చూపిన అహంకారాన్ని ప్రదర్శిస్తున్నదని ఎస్కేఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా రైతులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నది. 2017, జూన్ 6న శివరాజ్ సింగ్ పాలనలో మధ్యప్రదేశ్‌లోని మందసౌర్‌లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు జరిపిన కాల్పుల్లో ఆరుగురు రైతులు మరణించారు.

వచ్చే 10న భేటీలో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం

జూలై 10న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని, ఈ భేటీకి దేశవ్యాప్తంగా రైతు సంఘాల నేతలు పాల్గొంటారని ఎస్కేఎం తెలిపింది. దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం, రైతు ఆత్మహత్యల నివారణ కోసం లేదా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస మద్దతు ధర విషయంలో మోదీ మూడో ప్రభుత్వ మొదటి క్యాబినెట్ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని విమర్శించింది.

జరాంగేకు ఐవీ ఫ్లూయిడ్స్

రిజర్వేషన్లపై మంత్రి హామీ!

జాల్నా: మరాఠాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని మరాఠాల నాయకుడు మనోజ్ జరాంగే చేస్తున్న నిరాహార దీక్ష బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో రాష్ట్ర మంత్రి ఒకరు చర్చలు జరిపి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీ మేరకు తాను ఐవీ ఫ్లూయిడ్స్ తీసుకుంటున్నట్టు మనోజ్ జరాంగే తెలిపారు. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ఐవీ ఫ్లూయిడ్స్ తీసుకోవడం మళ్లీ ఆపేస్తానని ఆయన హెచ్చరించారు. తనకు హామీ ఇచ్చిన మంత్రి ఎవరనేది కూడా అప్పుడే బయటపెడతానని అన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకూ అభ్యర్థులను బరిలో నిలుపుతామని మనోజ్ పేర్కొన్నారు.

పార్టీలన్నీ 'టీమిండియా'లా పనిచేయాలి

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో నిర్మాణాత్మకమైన చర్చలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం కోరారు. సభలో ఆరోగ్యకర చర్చలు చూడాలని దేశ ప్రజలు అనుకొంటున్నారని అన్నారు. దేశానికి సేవ చేసేందుకు పార్టీలన్నీ 'టీమిండియా'లా ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్‌లో నాణ్యమైన చర్చలు జరగాలని, అర్థవంతమైన చర్చలను చూడాలని దేశం అనుకొంటున్నదని, ఈ మేరకు సభ సజావుగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని రిజిజు కోరారు. 18వ లోక్‌సభ మొదటి సెషన్ ఈ నెల 24న ప్రారంభం అవుతుందని, జూలై 3 వరకు సమావేశాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఒడిశా సీఎంగా చరణ్ మాఝీ
ప్రమాణ స్వీకారం

హాజరైన మోదీ, కేంద్రమంత్రులు

భువనేశ్వర్, జూన్ 12: ఒడిశా తొలి బీజేపీ సీఎంగా మోహన్ చరణ్ మాఝీ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ బీజేపీ నేత, పత్నగర్ ఎమ్మెల్యే కేవీ సింగ్ డియో, నంపర నుంచి తొలిసారిగా శాసనసభ్యుడిగా నెగ్గిన ప్రవతి పరిదు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ రఘుబర్ దాస్ వీరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు హాజరయ్యారు. పలువురు బీజేపీ పాలిత సీఎంలు కూడా ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మాఝీ పీఏ మృతి

మోహన్ మాఝీ వ్యక్తిగత కార్యదర్శి మహాపాత్ర (31) మంగళవారం ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. భువనేశ్వర్‌లో బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి ఒక కారు వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు.

అరుణాచల్ బీజేపీ ఎల్పీ నేతగా ఖండూ ఎన్నిక

ఇటానగర్, జూన్ 12: అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ మూడోసారి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో ఆయనను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. గురువారం ఖండూ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు తనను ఆహ్వానించాల్సిందిగా కోరునున్నట్టు తెలుస్తున్నది. 44 ఏండ్ల పేమా ఖండూ 2016 జూలై నుంచి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

నీట్ పేపర్ లీక్ కాలేదు

అక్రమాలకు పాల్పడ్డ విద్యార్థులపై చర్యలు తీసుకొన్నాం: ఎన్టీఏ

న్యూఢిల్లీ, జూన్ 12: నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కాలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) మరోసారి పేర్కొన్నది. పరీక్ష పవిత్రతను కాపాడటంలో ఎలాంటి రాజీ లేదని పురుద్ఘాటించింది. అయితే ఇది చెప్పొనే నీట్ పరీక్షలో 63 మంది విద్యార్థులు అక్రమ మార్గాలు ఉపయోగించారని, వారిలో 23 మందిని నీట్ రాయకుండా కొన్నేండ్లపాటు డీబార్ చేసినట్టు ఎన్టీఏ డీజీ సుబోధ్ కుమార్ సింగ్ బుధవారం వెల్లడించారు. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ సిఫార్సు మేరకు మిగిలిన 40 మంది విద్యార్థుల ఫలితాలను నిలుపుదల చేశామని తెలిపారు. కాగా, దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కీలకమైన నీట్ యూజీ-2024 పరీక్షలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు పెద్దయెత్తున వస్తున్న విషయం తెలిసిందే.

నీట్ పిటిషన్లపై నేడు సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ, జూన్ 12: నీట్ పరీక్షలో 1500 మందికి పైగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఎడ్యుటెక్ సంస్థ 'ఫిజిక్స్ వాలా' చీఫ్ ఎగ్జిక్యూటివ్ అలఖ్ పాండే బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పరీక్ష నిర్వహణపై ఒక స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీతో దర్యాప్తు చేయించాలని కోరారు. ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా ఏ పాలసీ ప్రకారం గ్రేస్ మార్కులు ఇచ్చారో ఎన్టీఏ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పిటిషన్‌తో పాటు మరో రెండు పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు సెలవు ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

హైకోర్టుల్లోని పిటిషన్ల బదిలీ కోరిన ఎన్టీఏ

నీట్ యూజీ-2024లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లన్నీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నది. ఈ మేరకు ఓ పిటిషన్ వేస్తామని ఎన్టీఏ తరపు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. మరోవైపు పలువురు నీట్ విద్యార్థులు దాఖలు చేసిన నాలుగు పిటిషన్లపై సమాధానం చెప్పాలని జస్టిస్ నీనా బన్సాల్ క్రిష్ణ వెకేషన్ బెంచ్ ఎన్టీఏకు నోటీసులిచ్చింది. అయితే కౌన్సెలింగ్‌పై స్టే విధించేందుకు ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించింది.

ఇంటి పునాదులే భారీ బ్యాటరీలు!

కాంక్రీట్‌లో కరెంట్ నిల్వ చేసుకోవచ్చు.. సఫలం దిశగా ఎంఐటీ పరిశోధన



న్యూఢిల్లీ: భవన నిర్మాణ రంగంలో వాడుతున్న కాంక్రీట్ విప్లవాత్మక మార్పులను తీసుకురాబోతున్నది. డాక్టర్ డేమియన్ స్టెఫానియుక్ అధ్వర్యంలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధక బృందం దీని కోసం కృషి చేస్తున్నది. ఎంఐటీ, హార్వర్డ్ విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనల్లో కాంక్రీట్‌ను విద్యుత్తు నిల్వ సాధనంగా ఉపయోగించవచ్చునని గుర్తించారు. సిమెంట్, నీరు, కార్బన్ బ్లాక్‌లతో ఈ కాంక్రీట్‌ను తయారు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ నిల్వ సాధనం సాధారణ బ్యాటరీకి ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. వారి పరిశోధనల ప్రకారం... *సౌర శక్తి, గాలి వంటి పునరుద్ధరణీయ మార్గాల నుంచి వచ్చిన విద్యుత్తును నేరుగా వినియోగించుకోగా, మిగిలిన విద్యుత్తును నిల్వ చేయడానికి ఈ సూపర్ కెపాసిటర్ ఉపయోగపడుతుంది. సోలార్ ప్యానల్స్ సామర్థ్యం జత కలిసిన ఆఫ్‌గ్రిడ్ హౌస్‌గా దీనిని చెప్పవచ్చు. నిల్వ చేసిన విద్యుత్తును రాత్రి వేళ వాడుకోవచ్చు. కాంగ్రిడ్ పవర్ సిస్టమ్‌తో, యుటిలిటీ కంపెనీతో ఏ విధంగానూ అనుసంధానం జరగని దానిని ఆఫ్‌గ్రిడ్ హౌస్ అంటారు. లిథియం బ్యాటరీలతో పర్యావరణానికి హాని జరుగుతుంది. ఇది పరిమితంగా అందుబాటులో ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా కార్బన్, సిమెంట్ సూపర్ కెపాసిటర్స్ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయి.*

ప్రమాదకరంగా నైట్రస్ ఆక్సైడ్ పెరుగుదల

మానవాళి మనుగడకు ప్రమాదం అన్న శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ: భూతాపాన్ని పెంచే నైట్రస్ ఆక్సైడ్ (ఎన్2ఓ) ఉద్గారాలు వాతావరణంలో పెరుగుతున్నాయి. 1980-2020 మధ్య వీటి పెరుగుదల 40 శాతం ఉండటం ఆందోళన కలిగించే విషయమని, ఈ ఉద్గారాల పెంపులో చైనా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత భారత్, అమెరికా దేశాలు ఉన్నట్టు ఒక నివేదిక వెల్లడించింది. కొందరు వాతావరణ శాస్త్రజ్ఞుల బృందంతో కూడిన గ్లోబల్ కార్బన్ ప్రాజెక్టు చేపట్టిన పరిశోధనల ప్రకారం 74 శాతం నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు మనం వాడే నత్రజని ఎరువులు, వ్యవసాయంలో వాడే జంతువుల ఎరువుల నుంచే విడుదలవుతున్నాయని వీరు వెల్లడించారు. ఎక్కువగా ఉద్గారాలు విడుదల చేసే మొదటి 10 దేశాల్లో చైనా, భారత్, అమెరికా, బ్రెజిల్, రష్యా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, టర్కీ, కెనడా ఉన్నాయి. కార్బన్‌డయాక్సైడ్, మెథాన్ తర్వాత అతి పెద్ద గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల విడుదలలో నైట్రస్ ఆక్సైడ్ మూడో స్థానంలో ఉందని పరిశోధకులు తెలిపారు. ఇప్పటికే ఈ గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల కారణంగా భూతాపం 1850-1900లతో పోలిస్తే 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. వ్యవసాయ వ్యర్థాల నుంచి వచ్చే ఉద్గారాలు 2020లో ఇది 8 మిలియన్ మెట్రిక్ టన్నులుగా నమోదైంది. 1980లో ఉన్న 4.8 మిలియన్ టన్నులతో పోలిస్తే 67 శాతం అధికమని ఎర్త్ సిస్టమ్ సైన్స్ జర్నల్ ప్రచురించిన డాటాలో వెల్లడించింది.

వ్యాయామం రెట్టింపు చేస్తే హై బీపీ రాదు!

న్యూఢిల్లీ, జూన్ 12: హై బీపీ నివారణపై ప్రస్తుత మార్గదర్శకాలను మార్చాలని ఓ అధ్యయనం అభిప్రాయపడింది. పెద్దల శారీరక శ్రమలో కనీస ప్రమాణాల్ని రెట్టింపు చేయాలని, తద్వారా హై బీపీని నివారించవచ్చునని పరిశోధకులు తెలిపారు. ఈ మేరకు *5* వేల మందిపై యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనాన్ని 'అమెరికన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్' ప్రచురించింది. హై బీపీ సమస్య పెరగడానికి కారణం..*18* నుంచి *40* ఏండ్ల వాళ్లలో వ్యాయామం చేసేవాళ్లు గణనీయంగా తగ్గడమేనని నివేదిక తెలిపింది. వైద్య నిపుణుడు జాసన్ నాగట మాట్లాడుతూ, 'యుక్త వయస్సులో ఉన్న నగం మందిలో శారీరక శ్రమ సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉంది. దీనికి, రక్తపోటు ఆరంభానికి సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో శారీరక శ్రమ కనీస ప్రమాణాన్ని పెంచాల్సిన అవసరముంది. దీనిని రెట్టింపు చేయటం ద్వారా హై బీపీని నివారించవచ్చు' అని అన్నారు.

శరీర ఉష్ణోగ్రత పెరిగితే గుండెకు హాని

న్యూఢిల్లీ: వయోజనుల శరీర ఉష్ణోగ్రత పెరిగితే, వారి గుండె గోడలకు రక్త ప్రవాహం పెరుగుతుందని, ఫలితంగా గుండె ఒత్తిడికి గురవుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. గుండెపై ఒత్తిడిని నిరోధించేందుకు చల్లని ప్రదేశాల్లో ఉండటం శ్రేయస్కరమని తెలిసింది. 'అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లో ఈ అధ్యయన నివేదిక ప్రచురితమైంది. 20 మంది యువ ఆరోగ్యవంతులు, 21 మంది ఆరోగ్యంగా ఉన్న నడి వయస్కులు, 20 మంది కరోనరీ ఆర్టెరీ డిసీజ్ (సీఏడీ)తో బాధ పడుతున్న వృద్ధులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వీరి శరీర ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెల్సియస్ వరకు పెంచి, పరిస్థితులను పరిశీలించారు. సీఏడీతో బాధపడుతున్న ఏడుగురి రక్త నాళాలు బంధింపబడటం వల్ల గుండెకు రక్త ప్రవాహంలో అడ్డంకులు ఏర్పడినట్లు వెల్లడైంది. అయినప్పటికీ వీరిలో అలాంటి లక్షణాలు కనిపించలేదు. గుండెకు ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని కరోనరీ ఆర్టెరీస్ సరఫరా చేస్తాయి. ఈ కరోనరీ ఆర్టెరీస్‌ను కుంచించుకుపోయేలా కానీ, అడ్డంకులు ఏర్పడేలా కానీ చేసేదే సీఏడీ వ్యాధి. ఈ నాళాల్లో కొలెస్ట్రాల్ సహా పాచిని పేరుకుపోయేలా చేస్తుంది. ఫలితంగా గుండె కండరాలకు రక్త ప్రవాహం పరిమితమవుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పుష్కలంగా నీరు తాగాలి. ఆల్కహాల్, కెఫీన్ తీసుకోకూడదు. తేలికగా, వదులుగా ఉండే, లేత రంగు దుస్తులను ధరించాలి.

గ్వాలియర్ దవాఖానలో
ఎలుకల హల్‌చల్

బీజేపీ సర్కార్ నిర్వహణ వైఫల్యంపై విమర్శలు

గ్వాలియర్, జూన్ 12: మధ్యప్రదేశ్‌లోని ప్రభుత్వ దవాఖానాల్లో నెలకొన్న అధ్వాన పరిస్థితులు రోగులు, వారి సహాయకుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. గ్వాలియర్ ప్రభుత్వ దవాఖానాలో ఎలుకలు రోగుల పడకలు, కుర్చీలపై ఇష్టమున్నట్టు సంచరిస్తున్నాయి. మందులు, ఆహార పొట్లాలను లాక్కెళ్లుతున్నాయి. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఇదీ పరిస్థితి..అంటూ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. దీనిని చూసిన నెటిజన్లు, దవాఖాన నిర్వహణలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖానలో రోగుల కన్నా ఎలుకలు ఎక్కువగా ఉన్నాయని కాంగ్రెస్ విమర్శించింది. బీజేపీ సర్కార్ నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపించింది. కాగా, ఎలుకల నియంత్రణపై చర్యలు చేపట్టాలని వైద్య అధికారిని ఆదేశించినట్టు మెడికల్ కాలేజీ డీన్ ఆర్‌కేఎస్ ధాకడ్ చెప్పారు.

ఇటలీలో గాంధీజీ విగ్రహం ధ్వంసం

న్యూఢిల్లీ, జూన్ 12: ఇటలీలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన కొద్ది గంటలకే ఖలిస్థానీ తీవ్రవాదులు బుధవారం ధ్వంసం చేశారు. హత్యకు గురైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్‌కు సంబంధించిన వివాదాస్పద నినాదాలను విగ్రహం దిమ్మెపై రాశారు. ఇట